# సాక్షి తిరుపతి

సోమవారం । 16 । సెప్టెంబర్ । 2024






## ప్రశ్నార్థకం.. పేదల స్వప్నం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదలకు మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణ పనులను టీడీపీ నేతలు అడ్డుకుంటున్నారు. - 8లో



## 'వసతి' నిర్వహణపై ఆగ్రహం

రేణిగుంటలోని గిరిజన రెసిడెన్షియల్ పాఠశాలను ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్‌నాయక్ తనిఖీ చేశారు. - 8లో



## ఆక్సిడెంట్ ఫ్రీ అవార్డులకు వినతి

సర్వీసులో ఎలాంటి ప్రమాదానికి కారణమవని వారికి అవార్డులు ఇప్పించాలని రైల్వే పెన్షనర్లు కోరారు. - 8లో

## ప్రభుత్వం పునరాలోచించాలి



గత ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 17 నూతన మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ ప్రారంభించింది. దీంతో నీట్‌లో ప్రతిభ చూపిన చాలా మంది రాష్ట్ర విద్యార్థులకు ఫ్రీ సీట్లు పొందే వెసులుబాటు కలిగింది. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేటు పరం చేసే దిశగా అడుగులు వేస్తోందని వార్తలు వస్తున్న నేపథ్యంలో పేద విద్యార్థులు, ప్రతిభ ఉన్న విద్యార్థులకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. ఫ్రీ సీట్లు పెద్ద సంఖ్యలో కోల్పోయే ప్రమాదం ఉంది. ప్రభుత్వం ఈ విషయంలో పునరాలోచించాల్సిన అవసరం ఉంది.

– డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, ఎమ్మెల్సీ, తిరుపతి



## ప్రైవేటీకరణను వెనక్కి తీసుకోవాలి



నూతనంగా ఏర్పడనున్న మెడికల్ కళాశాలలను ప్రభుత్వం ప్రైవేటు పరం చేస్తూ మా లాంటి పేద విద్యార్థుల డాక్టర్ కావాలన్న ఆశలపై నీళ్లు చల్లుతోంది. ప్రైవేటు కళాశాలల్లో రూ.లక్షలు పెట్టి చదివే స్థితిలేదు. డబ్బున్న వాళ్లే ఎంబీబీఎస్ చదివే విధంగా ప్రభుత్వం వ్యవహరించడం దారుణం. ఈ ఏడాది నీట్ పరీక్షలో 500కు పైగా ర్యాంకు వచ్చింది. కానీ సీటు రాలేదు. మళ్లీ లాంగ్‌టర్మ్ కోచింగ్ తీసుకుంటున్నా. నీట్‌లో ర్యాంక్ సాధించి మెడిసిన్‌లో చేరాలని కష్టపడుతున్నా.

–పావని, లాంగ్‌టర్మ్ కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థిని, తిరుపతి

## న్యూస్‌రీల్

### తిరుచ్చిపై వెంకన్న విహారం



ఊరేగుతున్న దేవదేవేరులు

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రవణోత్సవం సందర్భంగా ఆదివారం సాయంత్రం దేవదేవేరులు తిరుచ్చి వాహనంపై విహరించారు. ఈ క్రమంలో ఉదయం సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్యపూజా కైంకర్యాలు సమర్పించారు. కల్యాణ వెంకటేశ్వర స్వామి జన్మ నక్షత్రమైన శ్రవణ గడియల్లో అర్చన చేశారు. సాయంత్రం తిరుచ్చి వాహనంపై శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామివారిని కొలువుదీర్చి మాడవీధుల్లో ఊరేగించారు. పెద్దసంఖ్యలో భక్తులు కర్పూరనీరాజనాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయానికి చేరుకున్న ఉత్సవర్లకు ఆస్థానం నిర్వహించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ధర్మయ్య, అధికారి నాగరాజు పాల్గొన్నారు.

### చెంగాళమ్మ సేవలో 'చాగంటి'



చాగంటి దంపతులను సత్కరిస్తున్న ఆలయ అధికారులు

సూళ్లూరుపేట : పట్టణంలోని చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారిని ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు దంపతులు సేవించుకున్నారు. ఆదివారం ఆలయం వద్దకు విచ్చేసిన ఆయనకు ఇన్‌చార్జి ఈఓ శ్రీనివాసబాబు స్వాగతం పలికారు. అమ్మవారి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. తీర్థప్రసాదాలను అందించారు. ఈ క్రమంలోనే మన్నారుపోలూరులోని మల్లారి కృష్ణస్వామి ఆలయానికి చాగంటి వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు.

### ఆగమోక్తంగా అంకురార్పణ



అంకురార్పణ నిర్వహిస్తున్నఅర్చకులు

రాపూరు : పెంచలకోనలోని శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామిలో ఆదివారం రాత్రి పవిత్రోత్సవాలకు ఆగమోక్తంగా అంకురార్పణ నిర్వహించారు. ఆలయంలో తెలిసీ తెలియక జరిగే దోషాల పరిహారార్థం పవిత్రోత్సవాలు నిర్వహిస్తామని ప్రధాన అర్చకులు సీతారామయ్యస్వామి, పెంచలయ్యస్వామి తెలిపారు. మూడు రోజులపాటు ఉత్సవాలు జరుగుతాయన్నారు. ఈ క్రమంలో అలంకార మండపంలో స్వామి,అమ్మవార్ల ఉత్సవర్లను శేషవాహనంపై కొలువుదీర్చారు. స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం శాస్త్రోక్తంగా అంకురార్పణ చేపట్టారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు

తిరుపతి అర్బన్ : తమిళనాడులోని తిరువణ్ణామలైకి మంగళవారం వేకువజామున 4 నుంచి బుధవారం ఉదయం 8 గంటల వరకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు తిరుపతి అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామచంద్రనాయుడు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పౌర్ణమి సందర్భంగా భక్తుల సౌకర్యం కోసం ప్రత్యేకంగా ఏసీ సర్వీసులతోపాటు సూపర్‌లగ్జరీ, డీలక్స్, ఎక్స్‌ప్రెస్‌లు ఏర్పాటు చేశామని వెల్లడించారు. అలాగే ప్రయాణికులకు రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పించామన్నారు. తిరుపతి, గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి, సత్యవేడు, పుత్తూరు డిపోల నుంచి సర్వీసులు అందుబాటులో ఉంటాయని వివరించారు. ఇతర వివరాల కోసం 9959225686, 9959225684 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

### గిరిజనుల సంక్షేమానికి కృషి



వినతులు స్వీకరిస్తున్న ఎస్టీ కమిషన్ సభ్యుడు

తిరుపతి(అలిపిరి): గిరిజనుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నామని ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్య శంకర్ నాయక్ తెలిపారు. ఆదివారం తిరుపతిలోని పద్మావతి అతిథి గృహంలో ఆయన గిరిజనుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం బైరాగి పట్టెడలోని గిరిజన భవన్‌లో నిర్వహించిన గుండాల నాయక్ సంతాప సభలో పాల్గొన్నారు. రేణిగుంటలోని గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించారు. జిల్లా గిరిజన సంక్షేమ అభివృద్ధి శాఖ అధికారి సూర్యనారాయణ పాల్గొన్నారు.

# కేసు పట్టి.. రేటు కట్టి!

- తిరుపతిలో నివసిస్తున్న ఓ వ్యక్తి తన స్నేహితులతో గొడవపడ్డాడు. దీనిపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. వెంటనే సన్నివేశంలోకి ప్రవేశించిన కోర్టు కానిస్టేబుల్ బేరసారాలు మొదలుపెట్టాడు. ముందుగా ఫార్మాలిటీల కోసమని చెప్పి రూ.5వేలు వసూలు చేశాడు. తాను చెప్పిన న్యాయవాదిని కన్సల్ట్ అయితే త్వరితగతిన బెయిల్ మంజూరవుతుందని సలహా ఇచ్చాడు. దీంతో కోర్టు కానిస్టేబుల్ సూచించిన లాయర్‌నే సదరు నిందితుడు బెయిల్ కోసం మాట్లాడుకోగా, ఇద్దరూ కలిసి రూ.60వేలు గుంజేసుకున్నారు. మరికొంత మొత్తం చెల్లిస్తే ష్యూరిటీలు కూడా ఏర్పాటు చేసేందుకు సిద్ధమైనట్లు బాధితుడు వెల్లడిస్తున్నాడు.
- తిరుపతి రూరల్ మండలానికి చెందిన ఓ వ్యక్తి చిన్నపాటి రోడ్డు ప్రమాదం చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు. వెంటనే సదరు నిందితుడిని కోర్టు కానిస్టేబుల్ సంప్రదించాడు. తనకు అనుకూలమైన ఓ జూనియర్ లాయర్‌కు కేసు అప్పగించేలా నిందితుడిని ఒప్పించాడు. ఈ క్రమంలో న్యాయమూర్తి విచారించి జరిమానా విధించగా, కోర్టు కానిస్టేబుల్ అదనంగా మరో రూ.5వేలు వసూలు చేశాడు. మళ్లీ లాయర్‌కు రూ.20వేలు ఇవ్వాలని చెప్పి అంత మొత్తం రాబట్టేశాడు. దీంతో కోర్టు జరిమానాకు మించి కానిస్టేబుల్‌కే ఎక్కువ మొత్తం చెల్లించాల్సి వచ్చిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.



జిల్లాలోని కోర్టు కానిస్టేబుళ్లు వసూల్ రాజాలుగా మారిపోయారు. నిత్యం వేలాదిరూపాయలను అక్రమంగా ఆర్జిస్తున్నారు. చిన్నపాటి కేసులో పట్టుబడిన నిందితులను టార్గెట్ చేసుకుని తమ జేబులు నింపుకుంటున్నారు. అవినీతి ఖాకీలు అడిగినంత ఇవ్వకపోతే సాయంత్రం వరకు కోర్టు ఎదుట పడిగాపులు కాయాల్సి వస్తోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. న్యాయస్థానం విధించే జరిమానాకు మించి వీరి బాదుడే ఎక్కువైందని వాపోతున్నారు. దీనికితోడు కొందరు లాయర్లతో ఒప్పందం కుదుర్చుకుని మరీ కేసులు అమ్ముకుంటున్నట్లు ఆరోపిస్తున్నారు. కోర్టు కానిస్టేబుళ్ల వ్యవహారం తెలిసినా ఉన్నతాధికారులు కూడా పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు.

- అక్రమ సంపాదనలో కోర్టు కానిస్టేబుళ్లు
- జరిమానాకు మించి అదనపు వసూళ్లు
- న్యాయవాదులతో ఒప్పందం కుదుర్చుకుని బేరసారాలు
- స్టేషన్ మారినా ఏళ్ల తరబడి ఒకే విధులు

తిరుపతి క్రైం : చిన్నపాటి తప్పులు చేసి న్యాయస్థానానికి వెళితే చాలు.. కోర్టు కానిస్టేబుళ్ల బారిన పడాల్సిందే. జడ్జి విధించే జరిమానా కంటే వీరు వేసే జరిమానానే భారంగా మారుతోంది. ఈ విషయం చూసేందుకు చిన్నదిగా అనిపించినా.. జిల్లా వ్యాప్తంగా సాగుతున్న వ్యాపారంలో అవినీతి ఖాకీలు నిత్యం రూ.వేలు జేబులో వేసుకుంటున్నారు. తాము చేసిందే తప్పు కాబట్టి బాధితులు కూడా ఈదోపిడీపై నోరు మెదపడం లేదు. వీరు అడిగినంత ఇవ్వకపోతే కోర్టు వద్ద పడిగాపులు కాయాల్సిందేనని బెదిరిస్తుంటారు. దీంతో బాధితులు సైతం ముందూ వెనుకా ఆలోచించకుండా కోర్టు కానిస్టేబుళ్లు అడిగినంత ఇచ్చి అక్కడ నుంచి బయటపడుతున్నారు. ఈ క్రమంలోనే కోర్టుకు వచ్చే కేసులను కూడా సదరు కానిస్టేబుళ్లు తమకు అనుకూలమైన న్యాయవాదులకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ వ్యవహారం మొత్తం కోర్టు బయట జరుగుతుండడంతో ఎవరూ వీరిపై

### మధ్యవర్తులుగా మారుతూ..

కోర్టు కానిస్టేబుళ్లు కొందరు కేసులను అమ్ముకునే వ్యాపారం పెట్టినట్టు సమాచారం. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు, హత్య, హత్యాయత్నం కేసులు, ఇతర క్రిమినల్ కేసుల్లో నిందితుల నుంచి పెద్ద మొత్తంలో నగదు గుంజుతున్నట్లు తెలిసింది. ముఖ్యంగా ఇలాంటి కేసుల్లో బయటి ప్రాంతాలకు చెందిన వారు పట్టుబడితే కోర్టు కానిస్టేబుళ్లకు పండగే. సదరు నిందితులకు స్థానిక న్యాయవాదుల గురించి అంతగా తెలియదు. దీంతో కోర్టు కానిస్టేబుళ్లే మధ్యవర్తులుగా మారిపోతారు. ఫలానా న్యాయవాది అయితే మీకు తొందరగా బెయిల్ ఇప్పిస్తారని, కేసు గెలుస్తారని చెప్పి తమకు అనుకూలమైనవారికే కేసు అప్పగిస్తున్నారు. ఇందుకోసం ఇటు నిందితుల నుంచి అటు లాయర్ల నుంచి నగదు వసూలు చేసుకుంటున్నారు. కొన్ని కేసులను అయితే జూనియర్ లాయర్లకు అప్పగించి బాధితుల నుంచి భారీ మొత్తం గుంజేస్తున్నారని సీనియర్ న్యాయవాదులు సైతం ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలోనే లోక్ అదాలత్‌లో సైతం అడ్వొకేట్‌ల ప్రమేయం లేకుండా కోర్టు కానిస్టేబుళ్లే రాజీలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రధాన కేసుల్లో సాక్ష్యాలను సైతం తారుమారు చేస్తూ నిందితులను తప్పించడంలో కూడా కీలకంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. ఇటీవల పలువురు లాయర్లు ఈ విషయాన్ని న్యాయమూర్తులు దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు తెలిసింది.

చర్యలు తీసుకోవడంలేదు. దీంతో వీరు ఆడింది ఆట.. పాడింది పాటగా మారింది.

**చేయాల్సిన విధులు ఇవీ..!**

జిల్లా వ్యాప్తంగా ప్రతి పోలీసుస్టేషన్‌కు ఒక కోర్టు కానిస్టేబుల్ వుంటారు. ఆయనకు కోర్టు పనులకు అప్పగిస్తారు. కేసుల వివరాలను కోర్టులో అప్పగించడం, వాయిదాలకు హాజరుకావడం, చార్జిషీట్‌లు వేయడం, పెట్టీ కేసుల్లో నిందితులను కోర్టులో హాజరుపరచడం, వారి నుంచి జరిమానాలు కట్టించడం వంటివి వీరు చేయాలి. ఆదాయం ఎక్కువగా ఉండడంతో ఈ పోస్టులకోసం తీవ్రమైన పోటీ వుంటుంది. స్టేషన్ అధికారి తనకు ఇష్టమైనవారికే ఈ పోస్టు కట్టబెడతారు. ఈ క్రమంలో కొత్తవారు ఈ పోస్టులోకి రాకుండా పాతవారు అడ్డుకుంటున్నారు. కోర్టు వ్యవహారాలు కాబట్టి జాగ్రత్తగా ఉండాలని స్టేషన్ అధికారులు కూడా వీరి వైపే మొగ్గుతున్నారు. అయితే కోర్టు విధులు అప్పగించే కానిస్టేబుల్‌ను తరచూ మార్చడం వల్ల కాస్త అవినీతి తగ్గుతుందని పలువురు పోలీసులు, న్యాయవాదులు స్పష్టం చేస్తున్నారు.

### పెట్టీ కేసులకు గిరాకీ

చిన్న పాటి నేరాలు చేసి పోలీసులకు చిక్కిన వారిపై పోలీసులు పెట్టీ కేసులు పెట్టి కోర్టుకు హాజరుపరుస్తారు. నిందితులందరినీ కోర్టు కానిస్టేబుల్ ద్వారా న్యాయస్థానానికి పంపుతారు. జడ్జి విచారించి వీరికి రూ.100 నుంచి రూ.10వేల వరకు జరిమానాలు విధిస్తుంటారు. ఆ జరిమానాను సదరు కానిస్టేబుల్ అక్కడే కోర్టులోనే కట్టిస్తాడు. ఆ తర్వాత ఖర్చుల పేరుతో జరిమానా సొమ్ముకు రెట్టింపు వసూలు చేస్తున్నారని బాధితులు వాపోతున్నారు. ముఖ్యంగా ఆటో డ్రైవర్లు, పేకాటరాయుళ్లు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడినవారే వీరికి ఆదాయ వనరులుగా మారుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి స్టేషన్ నుంచి రోజూ ఇలాంటి పెట్టీ కేసులు కోర్టుకు 10 నుంచి 20 వరకు వస్తుంటాయి. ఆయా కేసుల్లో నిందితుల నుంచి రూ.3 నుంచి 5వేల చొప్పున వసూలు చేస్తున్నారు. ఈ విధంగా ఆదాయం అందించే ఈ కొలువు చేరినవారు ఏళ్ల తరబడి ఆదే పోస్టులో కొనసాగుతున్నారు. స్టేషన్లు మారవచ్చును కాని పోస్టులు మారడం లేదని ఇతర కానిస్టేబుళ్లు చెబుతున్నారు.

## శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణం ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ కృష్ణతేజ అతిథిగృహం వద్దకు చేరుకుంది. శనివారం అర్ధరాత్రి వరకు 80,735 మంది స్వామివారిని దర్శించుకోగా 40,524 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.19 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

### ముగిసిన గణేష్ నవరాత్రులు



సిద్ధి, బుద్ధి సమేత వినాయక స్వామి

తిరుమల : ధర్మగిరి వేద విజ్ఞాన పీఠంలో ఆదివారం మహా పూర్ణాహుతితో తొమ్మిది రోజుల పాటు జరిగిన గణేశ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. 7న వినాయక చవితి రోజు నుంచి గణనాథుని వివిధ అలంకారాలతో పూజించారు. చివరి రోజైన ఆదివారం సిద్ధి బుద్ధి సమేతంగా గణపతి స్వామివారు మూషిక వాహనంపై కొలువుదీరి భక్తులను అనుగ్రహించారు. విజ్ఞాన పీఠం ప్రిన్సిపల్ కేఎస్ఎస్ అవధాని ఆధ్వర్యంలో వేద విద్యార్థులు, అధ్యాపకులు పూజా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం 9 నుంచి 11 గంటల మధ్య వినాయకుని ప్రతిమను నిమజ్జనం చేయనున్నారు.

### కలెక్టరేట్‌లో నేటి గ్రీవెన్స్ రద్దు

తిరుపతి అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించాల్సిన గ్రీవెన్స్‌ను మిలాద్ ఉన్ నబీ సెలవు కారణంగా రద్దు చేసినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ వెల్లడించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ క్రమంలో అర్జీదారులు వ్యయ ప్రయాసలకోర్చి కలెక్టరేట్‌కు రావద్దని సూచించారు. ఈవిషయాన్ని ప్రజలు గమనించాలని కలెక్టర్ సూచించారు.

# ఆదర్శనీయం.. ప్రకృతి సేద్యం



మెక్సికో ప్రతినిధులకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్న ప్రకృతి సేద్యం అధికారులు



క్షేత్రస్థాయిలో సేంద్రియ సేద్యాన్ని పరిశీలిస్తున్న మెక్సికో బృందం

- పొదుపు మహిళల భాగస్వామ్యంతో సేంద్రియ వ్యవసాయం
- పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన రైతు సాధికార సంస్థ
- తిరుపతికి విచ్చేసిన మెక్సికో ప్రతినిధి బృందం
- క్షేత్రస్థాయిలో పర్యటన

తిరుపతి అర్బన్ : సేంద్రియ విధానాలకు ఆధునిక పద్ధతులు జోడించి జిల్లాలో ప్రకృతి వ్యవసాయం సాగిస్తున్నట్లు రైతు సాధికార సంస్థ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్ వెల్లడించారు. ఆదివారం తిరుపతికి విచ్చేసిన మెక్సికో ప్రతినిధి బృందంతో ఓ ప్రైవేట్ హోటల్‌లో సమావేశమయ్యారు. 15 మంది సభ్యులతో కూడిన ఈ బృందానికి సేంద్రియ సేద్యంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి సేద్యంలో వందశాతం పొదుపు సంఘాల సభ్యులను భాగస్వాములను చేసినట్లు చెప్పారు. మహిళా రైతులు ఆదర్శవంతంగా సేద్యంలో దూసుకుపోతున్నారని తెలిపారు. జిల్లాలో 291 పొదుపు సంఘాల నేతృత్వంలో 1,459 మంది మహిళా రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నట్లు వివరించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రోత్సాహం మేరకు మెప్మా ఆధ్వర్యంలో పొదుపు మహిళలు సూపర్‌మార్కెట్లు ఏర్పాటు చేసి విజయం సాధించారన్నారు. అదే తరహాలో మహిళలు ప్రకృతి పద్ధతుల్లో వ్యవసాయం చేస్తున్నారని చెప్పారు. ప్రధానంగా వరి.మామిడి, వేరుశనగతోపాటు 37 రకాల కూరగాయలను రసాయన ఎరువులు వాడకుండా కేవలం సేంద్రియ విధానంలోనే సాగుచేస్తున్నారని వెల్లడించారు. ఈ పంటలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. బీజామృతం, ఘన జీవామృతం, ద్రవ జీవామృతం, గుళికల తయారీ విధానం, విత్తనశుద్ధితో కలిగే ప్రయోజనాలను వివరించారు. సూర్యరశ్మి, గాలి, నీరు, మొక్కలు, సూక్ష్మజీవులు, మట్టి తదితర అన్ని అంశాలు ప్రకృతి వ్యవసాయంతో ముడిపడి ఉన్నాయని వివరించారు. రైతుల సంక్షేమమే కాకుండా ప్రజల ఆరోగ్యం, భూమి పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని పరిపూర్ణ విధానంతో ప్రకృతి సేద్యం అమలు చేస్తున్నామని తెలిపారు. ఇండో జర్మన్ గ్లోబల్ అకాడమీ ఫర్ ఆగ్రో ఎకాలజీ రిసెర్చ్ అండ్ లెర్నింగ్ సెంటర్ ద్వారా చేపట్టిన పలు కార్యక్రమాలను మెక్సికో నుంచి విచ్చేసిన పరిశోధకులు, సాంకేతిక నిపుణులు, రైతులకు వివరించారు. మెక్సికో ప్రతినిధి డియాజ్ మరియా మాట్లాడుతూ మహిళలను ప్రకృతి సేద్యంలో భాగస్వాములను చేయడం కొత్తగా ఉందని వివరించారు. ప్రకృతి సేద్యం అధికారులు సి. చంద్రశేఖర్, కె. సురేష్ బాబు, లక్ష్మీనాయక్, సుధాకర్, డాక్టర్ సందీప్, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ షణ్ముగం పాల్గొన్నారు.

### జీవామృతాల పరిశీలన

తిరుపతి రూరల్ మండలం వేమూరులోని వ్యవసాయ క్షేత్రాన్ని మెక్సికో ప్రతినిధుల బృందం సందర్శించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన డెమోను పరిశీలించింది. జీవామృతాల తయారీపై పరిశోధలను అధ్యయనం చేసింది. అనంతరం సి. రామాపురంలోని ప్రకృతి క్షేత్రంలో గుళికల తయారీ విధానాలను అడిగి తెలుసుకుంది. వ్యవసాయ కూలీలతోను మాట్లాడి సమాచారం సేకరించింది. మహిళా సంఘాల సభ్యులతో మమేకమై వ్యవసాయ విధానాలు, పెట్టుబడులు, దిగుబడి, రాబడి, మార్కెటింగ్‌పై ఆరా తీసింది.

## పరిశ్రమల అభివృద్ధికి సంపూర్ణ సహకారం

- ఎంపీ డాక్టర్ గురుమూర్తి

తిరుపతి కల్చరల్: తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 84 ఇంజినీరింగ్ కళాశాలు ఉన్నాయని, స్కిల్డ్ మ్యాన్ పవర్‌కు ఎలాంటి సిబ్బంది లేదని ఎంపీ డాక్టర్‌ం గురుమూర్తి తెలిపారు. ఆదివారం రామతులసీ కల్యాణ మండపంలో తిరుపతి ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ డాక్టర్ గురుమూర్తితో పాటు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నుంచి పలు రకాల ఎంఎస్ఎంఈ గ్రాంట్స్ ఉన్నాయని అయితే ఆ నిధులనుర ఒక ఆర్గనైజేషన్ మినహా మిగిలిన 29 ఆర్గనైజేషన్లు ఉపయోగించుకున్నట్లు లేదన్నారు. ఆ ఒక్క ఆర్గనైజేషన్ మాత్రం 25 కోట్ల నిధులను వినియోగించుకుందని తెలిపారు. మిగిలిన ఆర్గనైజేషన్లు ముందుకు వచ్చి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. తిరుపతి ఛాంబర్ ఆఫ్ కామర్స్ వారు చొరవ తీసుకుని ముందుకు వస్తే తన వంతు సహకారం అందిస్తానన్నారు. అందరి సౌలభ్యం కోసం మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని గత ప్రభుత్వంలో ప్రస్తుతం వైజాగ్‌లో మాత్రమే ఉన్నటువంటి ఎంఎస్ఎంఈ ప్రాంతీయ కార్యాలయాన్ని తిరుపతిలో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందని, త్వరలోనే తిరుపతిలో ఆ కార్యాలయం ఏర్పాటు అవుతుందని తెలిపారు. తిరుపతి పార్లమెంట్ పరిదిలో 742 కిలోమీటర్ల పరిధిలో జాతీయ రహదారులు అభివృద్ధి చేసేందుకు వివిధ ప్యాకేజీల కింద టెండర్లు పిలిచారని త్వరలో పనులు ప్రారంభ కానున్నాయన్నారు. గత ఐదేళ్లలో సుమారుగా 27,803 కోట్లతో 65 పరిశ్రమలు ఏర్పాటు అయ్యాయని వాటి ద్వారా 43,213 మందికి ఉపాధి లభించిందని తెలిపారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాగుతూ ప్రభుత్వం ద్వారా ఛాంబర్ ఆఫ్ కామర్స్‌కు కార్యాలయానికి అవసరమైన స్థలాన్ని మంజూరు చేయడం, రాయితీలు అందించడానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు రక్తదానం చేసి స్ఫూర్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు మోహన్‌కుమార్ రాజు, కార్యదర్శి వాసు, కోశాధికారి అయ్యప్ప, బయన్‌సేప్ మధు, మలిశెట్టి రవి పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ గురుమూర్తి

## క్లుప్తంగా

### యువశ్రీకి ఆచార్య దేవోభవ పురస్కారం



**తిరుపతి సిటీ:** పద్మావతి మహిళా వర్సిటీ తెలుగు అధ్యయన శాఖలో అధ్యాపకులుగా పని చేస్తున్న డాక్టర్ డి. యువశ్రీకి ఆచార్య దేవోభవ జాతీయ పురస్కారం లభించింది. ఈ మేరకు నూఢిల్లీకి చెందిన కలాంవిజన్, తిరుపతి యువ తేజం ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ఓ ప్రైవేటు పాఠశాలలో జరిగిన డాక్టర్ రాధాకృష్ణన్ జయంతి వేడుకలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ మనుమడు డాక్టర్ జి. సుబ్రమణ్యం శర్మ చేతుల మీదుగా ఆమె ఈ పురస్కారాన్ని అందుకున్నారు. విద్యారంగంలో ఆమె చేసిన కృషిని అతిథులు ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో కంకణాల రత్నయ్య, కె. కరీముల్లా, డాక్టర్ నారాయణస్వామి పాల్గొన్నారు.

### జేఆర్ఎఫ్‌లో 'అగ్రికల్చర్' విద్యార్థుల హవా



ఇంతియాజ్ దేవిరెడ్డి సాయి వైష్ణవి

**తిరుపతి సిటీ :** జాతీయ స్థాయిలో నిర్వహించిన అగ్రికల్చర్ పీజీ కోర్సుల ప్రవేశ పరీక్షలో తిరుపతి ఎస్వీ అగ్రికల్చర్ కళాశాల విద్యార్థులు 13, 14ర్యాంకులు సాధించి సత్తా చాటారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐసీఏఆర్) నిర్వహించిన జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్(జేఆర్ఎఫ్) పరీక్షలో ఎంటమాలజీ విభాగంలో ఇంతియాజ్ 13వ ర్యాంకు సాధించగా, అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో దేవిరెడ్డి సాయి వైష్ణవి 14వర్యాంకు సాధించారు. అలాగే కె.ప్రవీణ్ కుమార్ 33, వి.జితేంద్ర పాతి 40, అఫిఫా తస్లీన్ 44వ ర్యాంకు దక్కించుకున్నారు. కళాశాలకు చెందిన మొత్తం 50మంది విద్యార్థులు దేశంలోని పలు పీజీ కళాశాలలో సీట్లు పొందారు.






## పేదలకు తీరని అన్యాయం



గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేటు పరం చేసే దిశగా అడుగులు వేయడం వల్ల పేద విద్యార్థులకు తీరని అన్యాయం చేస్తోంది. గత ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 17 నూతన మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేసేందుకు పకడ్బందీగా కార్యాచరణ ప్రారంభించింది. దీంతో నీట్‌లో ప్రతిభ చూపిన మా లాంటి పేద విద్యార్థులకు ఉచిత సీట్లు పొందే వెసులుబాటు కలిగింది. కానీ ఉచిత సీట్లు పెద్ద సంఖ్యలో కోల్పోయే ప్రమాదం ఉంది. ఇంతకు ముందు నీట్‌రాశాను సీటు రాలేదు. ఈ సారైనా వస్తుందనుకుంటున్నా.

**- సానియా, వేపగుంట, పుత్తూరు**




## మా ఆశలపై నీళ్లు



కొత్త ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే మా లాంటి పేద విద్యార్థుల ఆశలపై నీళ్లు చల్లినట్టే. ప్రైవేటు కళాశాలల్లో లక్షలు పెట్టి చదివే స్థోమత మాకు లేదు. కేవలం డబ్బున్న వాళ్లే ఎంబీబీఎస్ చదివే విధంగా ప్రభుత్వం వ్యవహరించడం దారుణం. ఈ ఏడాది నీట్ పరీక్షలో 500కు పైగా ర్యాంకు వచ్చింది. కానీ సీటు రాలేదు. ఇప్పటికే రెండు సార్లు నీట్ కోచింగ్ తీసుకున్నా. ఇప్పుడు మళ్లీ లాంగ్‌టర్మ్ కోచింగ్ పోతున్నాను. వచ్చే ఏడాది నీట్‌లో ర్యాంక్ సాధించి మెడిసిన్‌లో చేరాలని శ్రమ పడుతున్నా.

**- టి.ప్రభు, పెద్దతయ్యూరు, శ్రీరంగరాజపురం**

జీపాళెం లే అవుట్‌లో అసంపూర్తిగా ఇంటి నిర్మాణాలు





# ప్రశ్నార్థకం.. పేదల స్వప్నం

పేదల సొంతింటి కల నెరవేరకుండా టీడీపీ నేతలు మోకాలడ్డుతున్నారు. గత ప్రభుత్వంలో పనులు దక్కించుకున్న వారిని పక్కనపెట్టాలని హుకుం జారీ చేస్తున్నారు. దీంతో హౌసింగ్ అధికారులు చేసేది లేక ఎమ్మెల్యేల సిఫార్సు లెటర్లు తెచ్చుకోవాలని కాంట్రాక్టర్లను ఆదేశిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో తామ నిర్మాణాలు పూర్తి చేయలేమని గుత్తేదారులు తెగేసి చెబుతున్నారు. ఇప్పటి వరకు చేసిన పనులకు బిల్లులు చెల్లిస్తే వెళ్లిపోతామని స్పష్టం చేస్తున్నారు. ఈ క్రమంలో అడకత్తెరలో పోకచెక్కలా అధికారులు నలిగిపోతున్నారు. పచ్చమూక ఒత్తిడి భరించలేక తలలు పట్టుకుంటున్నారు.

- పక్కా ఇళ్ల నిర్మాణ పనులు అడ్డుకుంటున్న టీడీపీ నేతలు
- ఎమ్మెల్యే సిఫార్సు లెటర్ తీసుకు రావాలంటున్న అధికారులు
- బిల్లులు చెల్లిస్తే వెళ్లిపోతామంటున్న కాంట్రాక్టర్లు
- అయోమయంలో లబ్ధిదారులు





కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి బయటకు వస్తున్న కాంట్రాక్టర్లు (ఫైల్), లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న హౌసింగ్ జిల్లా అధికారి వెంకటేశ్వరరావు

**తిరుపతి అర్బన్ :** నిరుపేదలకు గూడు కల్పించాలనే సదుద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఇంటి పట్టాలు పంపిణీ చేసింది. నెలకు 1,100 చొప్పున వంద రోజుల ప్రణాళికతో 3,300 ఇళ్లు నిర్మించి పేదలకు అప్పగించాలని సంకల్పించింది. ఈ మేరకు జిల్లావ్యాప్తంగా మొత్తం 136 మంది కాంట్రాక్టర్లకు ఇంటి నిర్మాణ బాధ్యతలు అప్పగించింది. ఈ క్రమంలోనే దాదాసు 26,029 ఇళ్లు పూర్తి చేయించింది. అయితే ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మాత్రం ఎలాంటి లక్ష్యం లేకుండా నడుస్తోంది. ఇదే అదునుగా భావించిన టీడీపీ నేతలు ఇప్పటి వరకు పనులు చేస్తున్న కాంట్రాక్టర్లపై మూకుమ్మడిగా పడుతున్నారు. మొత్త ఇళ్ల నిర్మాణ పనులు తమకే అప్పగించాలంటూ గృహనిర్మాణశాఖ అధికారులపై తీవ్రంగా ఒత్తిడి చేస్తున్నారు. టీడీపీ నేతల ఒత్తిడిని తట్టుకోలేక అధికారులు ఈ మేరకు కాంట్రాక్టర్లను వెంటనే తప్పుకోవాలని ఆదేశిస్తున్నారు. రెండు నెలలు గడువు ఇస్తే బ్యాలెన్స్ పనులు పూర్తి చేస్తామని కాంట్రాక్టర్లు మొత్తుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మీరు పనులు చేయాలంటే స్థానిక ఎమ్మెల్యే నుంచి లెటర్ తీసుకురావాలంటూ కండిషన్ విధిస్తున్నారు.

**ఒక్కో ఇంటికి రూ.4 లక్షలంటూ ప్రచారం**

కూటమి సర్కార్ జూన్‌లో అధికారంలోకి వచ్చింది. అయితే జూన్‌లో జిల్లా వ్యాప్తంగా ఒక్క ఇంటినీ నిర్మించలేదు. జూలైలో కేవలం 31 ఇళ్లు నిర్మించారు. ఆగస్టులో మాత్రం 280 గృహాలు పూర్తి చేశారు. ఈ లెక్క పట్టాలు పొందిన వారందరికి ఇళ్లు పూర్తి చేయించి ఇవ్వడానికి మరో 20ఏళ్లు పడుతుంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.1.80లక్షలు ఇచ్చింది. అయితే తాము రూ.4లక్షలు ఇస్తామని టీడీపీ నేతలు ఎన్నికల సమయంలో ఊదరగొట్టారు. మరోవైపు గతంలో సిమెంట్, కమ్మి, ఇసుకతోపాటు 15 రకాల సామగ్రిని రాయితీలతో అందించారు. అప్పుడు తెప్పించిన సామగ్రి ఇప్పటికీ జిల్లాలోని 42 హౌసింగ్ గిడ్డంగుల్లో స్టాక్ ఉంది. వాటిని ఇంటి నిర్మాణదారులకు ఇవ్వడం లేదు. దీంతో ఆ వస్తువులు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి.

**కలెక్టర్‌కు మొరపెట్టుకున్న కాంట్రాక్టర్లు**

టీడీపీ నేతల కారణంగా అధికారులు ఒత్తిడి చేస్తుండడంతో కాంట్రాక్టర్లు దిక్కుతోచక కొట్టుమిట్టాడుతున్నారు. కూటమి ఎమ్మెల్యేలు తమకు అండగా నిలవరని చెబుతున్నారు. ఇప్పటి వరకు తాము చేసిన పనులకు బిల్లులు ఇప్పిస్తే అదే చాలంటూ స్పష్టం చేస్తున్నారు. ఈ మేరకు ఇటీవలే కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసి మొరపెట్టుకున్నారు. అయినప్పటికీ హౌసింగ్ అధికారులతో కాంట్రాక్టర్ల పంచాయితీలు నిత్యం కొనసాగుతూనే ఉన్నాయి. పేదల సొంతి కల సాకారంపై ప్రశ్నలు తలెత్తుతూనే ఉన్నాయి.

**జిల్లా సమాచారం**

| | |
|---|---|
| గత వైఎస్సార్‌సీపీ ఏర్పాటు చేసిన లేఅవుట్‌లు | : 575 |
| ఇల్లు మంజూరైన లబ్ధిదారులు | : 80,209 |
| పట్టణ ప్రాంతాల్లోని వారు | : 73,243 |
| గ్రామీణ ప్రాంతాల్లోని వారు | : 6,966 |
| ఇప్పటి వరకు పూర్తయిన ఇళ్లు | : 23,937 |
| వివిధ దశల్లో ఉన్నవి | : 38,097 |

**మార్గదర్శకాలు రాలేదు**

ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి ప్రభుత్వం నుంచి కొత్త మార్గదర్శకాలు ఏమీ రాలేదు. ఒక్కో ఇంటికి రూ.1.80లక్షలు చొప్పున 15 రకాల వస్తువులే ఇస్తున్నాం. అయితే కొందరు రూ.4లక్షలు ఇస్తారంటూ ప్రచారం జరగడంతో ఇంటి నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతోంది. ఈ విషయంపై అందరికి అవగాహన కల్పిస్తున్నాం. ప్రభుత్వం నుంచి కొత్త ఉత్తర్వులు రాలేదని చెబుతున్నాం. రాయితీతో ఇచ్చే వస్తువులు 26,068 వరకు హౌసింగ్ గిడ్డంగుల్లో స్టాక్ ఉన్నాయి. లబ్ధిదారులందరూ ఇంటి నిర్మాణాలు చేపట్టుకోవాలని కోరుతున్నాం.

**- వెంకటేశ్వరరావు, జిల్లా గృహనిర్మాణశాఖ అధికారి**

**రూ.4 లక్షలు ఇవ్వరంట**

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాకు జీపాళెం లేఅవుట్‌లో ఇంటి పట్టా ఇచ్చింది. రూ. 1.80 లక్షలు అందించింది. అయితే ప్రస్తుతం ఒక్కో ఇంటికి రూ. 4లక్షలు ఇస్తారంటూ టీడీపీ నేతలు ప్రచారం చేస్తున్నారు. ఆ డబ్బులు వచ్చిన తర్వాత ఇంటి నిర్మాణం చేపట్టుకుందామని ఎదురుచూస్తున్నాం. అయితే కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేసిన మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు క్లారిటీ రాలేదు. దీంతో ఎం చేయాలో అర్థం కావడంలేదు. తీరా అధికారులను అడిగితే రూ.4 లక్షలు ఇవ్వరని తెలుస్తోంది.

**- వెంకటరమణ, కొర్లగుంట, తిరుపతి**

**లేఅవుట్లు అభివృద్ధి చేయాలి**

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వేలాదిమందికి ఇంటిపట్టాలు ఇచ్చారు. మాకు చిందేపల్లి లేఅవుట్‌లో స్థలం కేటాయించారు. మా లేఅవుట్‌లో చాలా గృహాలు పూర్తి చేశారు. అయితే కొత్త ప్రభుత్వం మాత్రం లేఅవుట్ల అభివృద్ధిని పట్టించుకోవడం లేదు. హౌసింగ్ అధికారులు ఇంటి నిర్మాణ పనుల దిశగా రావడంలేదు. ఇప్పటికైనా సర్కారు స్పందించి గతంలో శ్రీకారం చుట్టిన లేఅవుట్‌లను అభివృద్ధి చేయాలి. పేదల పరిస్థితిని అర్థం చేసుకోవాలి.

**- తులసీరామ్, బైరాగిపట్టెడ, తిరుపతి**

## ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ మధుకృష్ణారెడ్డి

**తిరుపతి కల్చరల్ :** జర్నలిస్టులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించడం అవసరమని డీబీఆర్ అండ్ ఎస్‌కే ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ మధుకృష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో డీబీఆర్ అండ్ ఎస్‌కే ఆస్పత్రి వారు మెడికల్ క్యాంప్ నిర్వహించారు. జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు చేపట్టి మందులు పంపిణీ చేశారు. మధుకృష్ణారెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులకు చేసిన ప్రాథమిక వైద్య పరీక్షల్లో కొన్ని అనారోగ్య సమస్యలను గుర్తించామన్నారు. వారికి తమ ఆస్పత్రిలో ఉచితంగా మెరుగైన వైద్య పరీక్షలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 40 ఏళ్లు దాటిన మహిళలు, 60 ఏళ్లు పైబడిన పురుషులకు పూర్తి స్థాయిలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయిస్తామని తెలిపారు. ప్రెస్‌క్లబ్ కార్యదర్శి బాలచంద్ర మాట్లాడుతూ గత రెండేళ్లుగా జర్నలిస్టుల ఆరోగ్య పరిరక్షణకు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డీబీఆర్ ఆస్పత్రి వైద్యులు తులసీరామ్, వెంకటేష్, యుగంధర్, ప్రవీణ్, స్వప్న, ప్రెస్ క్లబ్ కోశాధికారి శ్రీకాంత్, వరప్రసాద్, సునీల్ పాల్గొన్నారు.

## శోభ కుటుంబానికి పరామర్శ



శోభ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి

**చౌడేపల్లి:** ఎవరూ అధైర్యపడకండి.. ఏకష్టమొచ్చినా అండగా తామున్నామంటూ శోభ కుటుంబానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి భరోసా ఇచ్చారు. తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డిలతో కలిసి ఆదివారం మండలంలోని పందిళ్లపల్లె పంచాయతీ ముదిరెడ్డిపల్లెలో మాజీ సింగిల్ విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి ఇంటికి వెళ్లారు. గత నెల 5వ తేదీన రవిచంద్రారెడ్డి సతీమణి శోభ మృతిచెందిన విషయం తెలిసిందే. దశదిన కర్మక్రియలకు హాజరైన మాజీ మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు శోభ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాల నుంచి ముదిరెడ్డిపల్లెకు చేరుకొన్న వైఎస్సార్‌సీపీ నాయకులను, అభిమానులను పెద్దిరెడ్డి ఆప్యాయంగా పలకరించి, సరదాగా ముచ్చటించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, వైస్ ఎంపీపీ సుధాకర్ రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

## రూ.3.10 లక్షలు పలికిన లడ్డూ



లడ్డూతో ఎంపీటీసీ యోగానందరెడ్డి

**తిరుపతి రూరల్ :** తిరుపతి రూరల్ మండలం వేమూరులో వినాయకుడి లడ్డూ వేలంలో రికార్డు స్థాయి ధర పలికింది. ఈశలాపురం దిలీప్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు భక్తులు పోటీపడగా బ్రాహ్మణ పట్టు ఎంపీటీసీ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నేత యోగానంద రెడ్డి రూ.3.10లక్షలకు లడ్డూ ప్రసాదం దక్కించుకున్నారు. యోగానందరెడ్డి మాట్లాడుతూ స్వామి వారి ప్రసాదం పొందడం అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు.

## 'వసతి' నిర్వహణపై ఆగ్రహం

**రేణిగుంట :** రేణిగుంటలోని గిరిజన గురుకుల విద్యాలయాన్ని ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఇక్కడి హాస్టల్‌లో పేద విద్యార్థులున్నారని, వసతి నిర్వహణ అధ్వానంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల అలసత్వం కారణంగా ఈ ఏడాది వందల మంది పిల్లలు టీసీ తీసుకుని వెళ్లిపోయారని మండిపడ్డారు. పేద విద్యార్థులకు అన్యాయం చేస్తే సహించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. అనంతరం విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. పిల్లలకు మెరుగైన విద్య అందించాలని ఇన్‌చార్జి ప్రిన్సిపల్ హరిబాబును ఆదేశించారు. ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో డీటీడబ్ల్యూఓ సూర్యనారాయణ, స్కూల్ కమిటీ చైర్మన్ కుప్పం రాజేష్ పాల్గొన్నారు.

## ముగ్గురు ఎర్రదొంగల అరెస్ట్



నిందితుల అరెస్ట్ చూపుతున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

**తిరుపతి మంగళం :** ముగ్గురు ఎర్రచందనం స్మగ్లర్లను ఆదివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి 38 దుంగలు, ఒక కారు, రెండు మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. టాస్క్ ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ ఐ ( ఆపరేషన్స్) సురేష్ కుమార్ రెడ్డి, ఆర్ఎస్ఐలు లింగాధర్, విశ్వనాథ్ బృందాలు మంగళం అటవీప్రాంతంలో కూంబింగ్ చేపట్టారు. కారులో ఎర్రచందనం దుంగలు లోడ్ చేస్తుండగా గమనించి చుట్టుముట్టారు. కొందరు స్మగ్లర్లు తప్పించుకోగా ముగ్గురు పట్టుబడ్డారు. సీఐ సురేష్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## రైలు ఢీ కొని వ్యక్తి మృతి

**వెంకటగిరిరూరల్ :** వెంకటగిరి స్టేషన్ సమీపంలో ఆదివారం శేషాద్రి ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి(45) చెందాడు. గూడూరు రైల్వే పోలీసులు కమృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వెంకటగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పర్యాటకంపై వీడియో-రీల్స్ పోటీలు

**తిరుపతి(అలిపిరి):** ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఈనెల 27వ తేదీన జిల్లాలోని ఆలయాలు, పర్యాటక ప్రాంతాల విశిష్టతను తెలియజేస్తూ 'వీడియో-రీల్స్' పోటీలు నిర్వహించనున్నట్లు టూరిజం ఈడీ రమణ ప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మొదటి బహుమతిగా రూ.లక్ష, ద్వితీయ బహుమతిగా రూ.50 వేలు, తృతీయ బహుమతిగా రూ.25 వేలు అందించనున్నట్లు వెల్లడించారు. ఈనెల 24వ తేదీలోపు వీడియోలు-రీల్స్ పంపాలని కోరారు.వివరాలకు 9154989719, 6309942027 నంబర్లు, https:/ tirupati. ap. gov. in/ https:/ tirupati. ap. gov. in/ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

## ఆక్సిడెంట్ ఫ్రీ అవార్డులకు వినతి

**రేణిగుంట :** సర్వీసులో ఎటువంటి ప్రమాదానికి కారణమవని విశ్రాంత స్టేషన్ మాస్టర్, పాయింట్‌మన్‌లకు ఆక్సిడెంట్ ఫ్రీ అవార్డులు అందించాలని సౌత్ సెంట్రల్ రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ నాగ్యనాయక్‌కు రేణిగుంట రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు విన్నవించారు. ఆదివారం రేణిగుంట రైల్వే స్టేషన్‌కు విచ్చేసిన నాగ్యనాయక్‌ను పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమరంలో జయంత్ కుమార్, జ్ఞాన శేఖర్, వెంకటేశ్వర్లు, రవి విజయ్ కుమార్, జయసీలన్, తిమ్మారెడ్డి, రవీంద్రన్, శేషాద్రి పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

**శ్రీకాళహస్తి రూరల్:** మండలంలోని జగ్గరాజుపల్లె వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యల్లంపల్లెకు చెందిన వెంకటేష్ (19) అనే యువకుడు మృతి చెందాడు. అనంతపురంలో బీటెక్ చదువుతున్న వెంకటేష్ వినాయక చవితి సెలవులకు సొంత ఊరికి వచ్చి తన స్నేహితుడు జయ కుమార్‌తో కలసి బైక్‌పై వెళుతుండగా ట్రాక్టర్ ఢీకొంది. దీంతో వెంకటేష్ అక్కడక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన జయకుమార్‌ను 108 వాహనంలో తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నవోదయ 3వ జాబితా ఫలితాల్లో విశ్వం ప్రభంజనం



నవోదయలో సీట్లు సాధించిన విశ్వం విద్యార్థులు

**తిరుపతి ఎడ్యుకేషన్ :** జవహర్ నవోదయ విద్యాలయంలో 2024-25విద్యాసంవత్సరంలో 6, 9వ తరగతిలో ప్రవేశానికి నిర్వహించిన పరీక్ష 3వ జాబి తా ఫలితాల్లో తిరుపతిలోని విశ్వం విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఈ మేరకు ఆ విద్యాసంస్థ అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. నవోదయ ప్రవేశ పరీక్ష మూడు జాబితాల ఫలితా ల్లో 6, 9వ తరగతిలోకి మొత్తం 59 మంది విద్యార్థు లు సీట్లు సాధించినట్లు తెలిపారు. గత 34 ఏళ్లుగా జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న సైనిక్, నవోదయ, మిలిటరీ స్కూల్స్ వంటి పోటీ పరీక్షలకు నాణ్యమైన శిక్షణ ఇవ్వడంతో జాతీయ స్థాయిలో ఉత్తమ ఫలితాలతో పాటు అత్యుత్తమ మార్కులు, ర్యాంకులను తమ విద్యార్థులు సాధిస్తున్నారని తెలిపారు. అనంతరం నవోదయలో సీట్లు సాధించిన విద్యార్థులను ఆ విద్యాసంస్థ అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి, కరస్పాండెంట్ ఎన్.తులసీ విశ్వనాథ్ అభినందించారు.

## అలరించిన సంగీత నృత్యోత్సవాలు



కళాకారుల నృత్య ప్రదర్శన

**తిరుపతి కల్చరల్:** శ్రీసాయి నటరాజ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఎస్వీ సంగీత, నృత్య కళాశాల ఆడిటోరియంలో ఆదివారం ప్రదర్శించిన దక్షిణ భారత సంగీత, నృత్యోత్సవాలు అలరించాయి. తెలంగాణ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక ప్రాంతాలకు చెందిన కళాకారుల బృందాలు పాల్గొన్నాయి. ముఖ్య అతిథి ఎస్వీ సంగీత, నృత్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఉమ ముద్దుబాల హాజరై 120 మంది నృత్య కళాకారులకు ప్రతిభ అవార్డులతో ఘనంగా సత్కరించి అభినందించారు. అలాగే నృత్య కళ వికాసం కోసం నిరంతరం కృషి చేస్తున్న నాట్యాచార్యులకు గురు శ్రేష్ఠ అవార్డులతో సత్కరించి అభినందించారు. భారతనాట్య గురువు డాక్టర్ కె.దేవేంద్ర పిళ్లై, కూచిపూడి విభాగాధిపతి డాక్టర్ ఉషారాణి, విశ్వం స్కూల్స్ డైరెక్టర్ విశ్వచందన్‌రెడ్డి, శ్రీసాయి నటరాజ అకాడమీ ఆర్ట్స్ డైరెక్టర్ శరత్ చంద్ర, కళాకారులు పాల్గొన్నారు.